జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
శుక్రవారం 20 నవంబర్ 2026 పేజీలు:19



సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

హాలియా,నవంబర్19(ప్రజా జ్యోతి)

పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని 2వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ--సైదులు పేర్కొన్నారు.

వివరాలు 2లో



ఉక్కుమహిళ ఇందిరాగాంధీ సేవలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

మిర్యాలగూడలో ఘనంగా ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలు

మిర్యాలగూడ, నవంబర్ 19,(ప్రజాజ్యోతి):

భారతదేశ తొలి మహిళా ప్రధాని, ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరాగాంధీ సేవలు స్ఫూర్తిదాయకమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)అన్నారు.గురువారంమిర్యాలగూడ పట్టణంలో ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ109వ, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వివరాలు 2లో



అర్హులందరికీ చేయూత పెన్షన్లు

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- సూర్యాపేటలో 2102 మందికి పెన్షన్లు మంజూరు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 19(ప్రజా జ్యోతి):

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏఐసీసీ సభ్యులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.

వివరాలు 2లో

చిన్న నీటి చెరువుల పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించాలి

- మంజూరైన పనులన్నీ శుక్రవారం నుంచే చేపట్టాలి:

- కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 19: (ప్రజా జ్యోతి)



నల్లగొండ : వివిజి రామ్ జీ పథకం ద్వారా జిల్లాలోని చిన్న నీటి చెరువులన్నింటినీ పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో వివిజి రామ్ జీ పథకం కింద చేపట్టనున్న పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

వివరాలు 2లో

వ్యాసరచన పోటీలో శాస్త్ర పాఠశాల విద్యార్థినికి బహుమతి

రామన్నపేట, నవంబర్ 19: (ప్రజా జ్యోతి)

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఆర్ఎస్ఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో శాస్త్ర హైస్కూల్, ఆర్టీసీ కాలనీ, నల్గొండకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మేడి సాక్షి వ్యాసరచన పోటీలో బహుమతి సాధించింది.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినికి నిర్వాహకులు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల కరస్పాండెంట్ కిషోర్ కుమార్, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థినిని అభినందించి ప్రోత్సహించారు.



సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

హాలియా మున్సిపాలిటీలోని 2వ వార్డుకు చెందిన పెరుమాళ్ల వెంకటమ్మకు ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రాన్ని గురువారం అందజేశారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి చొరవతో,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సహకారంతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు.ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు చెన్ను రాజేశ్వరి, మాజీ ఉపసర్పంచ్ పాంపాటి శ్రీనివాసులు,నకిరేకంటి సైదులు, వార్డు ఆఫీసర్ కల్పన,గద్దె నాగరాజు,మైనంపాటి సంతోష్ రెడ్డి, రవికుమార్, మున్సిపల్ అధికారులు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుమహిళ ఇందిరాగాంధీ సేవలు స్ఫూర్తిదాయకం

మొదటిపేజీ తరువాయి



పట్టణం లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు మహిళలతో కలిసి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు.అనంతరం ఇందిరమ్మ చీరలు ధరించి కార్యక్రమానికి హాజరైన మహిళలతో కలిసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ధైర్యం, దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలతో ప్రపంచ స్థాయిలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ఆమె నాయకత్వం, సాధించిన విజయాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఇందిరా గాంధీ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ , వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ , రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దీరావత్ సైలాబ్ నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, మోయిజ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత పెన్షన్లు

మొదటిపేజీ తరువాయి



గురువారం జిల్లా కేంద్రంలోని రవిమహల్‌లో జరిగిన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.గత బీఆర్ఎస్ పాలనలో పింఛన్లు అందక అనేక మంది అర్హులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా లక్షలాది మందికి పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు.సూర్యాపేట పట్టణంలో 2102 చేయూత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు.అర్హులైన లబ్ధిదారులందరికీ మంజూరు పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.అర్హులందరికీ చేయూత పింఛన్లు అందించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఇందులో మధ్యవర్తుల ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు.అర్హత ఉన్నవారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లబ్ధిదారులకు పింఛన్లు సకాలంలో అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ,, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల సహకారం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, కౌన్సిలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



చిన్న నీటి చెరువుల పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించాలి

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీరు కేవలం తాగునీటి అవసరాలకే సరిపోతుందని తెలిపారు. మూసీ నదిలో నీరు ఉన్నప్పటికీ అది తాగడానికి పనికిరాదని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించుకుంటూనే వర్షపు నీటిని చెరువుల్లోకి మళ్లించి భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.చెరువుల పునరుద్ధరణలో భాగంగా మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టి వాటిని పటిష్టం చేయాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే గుర్తించి మంజూరు చేసిన చెరువుల పనులన్నింటినీ శుక్రవారం నుంచే ప్రారంభించాలని ఆదేశించారు. ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత, శిఖం హద్దుల వద్ద కందకాల తవ్వకం, ఒండ్రుమట్టి తీసే ప్రాంతాల్లో ముళ్లపొదల తొలగింపు వంటి పనులు చేపట్టాలని సూచించారు.అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి మంజూరైన పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అన్ని చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్ (పూర్తిస్థాయి నీటిమట్టం) సరిహద్దులను పరిరక్షించాల్సిన బాధ్యత ఇరిగేషన్ శాఖపై ఉందని స్పష్టం చేశారు.చెరువుల పునరుద్ధరణతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, చెరువులు పటిష్టంగా మారడంతోపాటు ఫీడర్ ఛానళ్లు, ఫీల్డ్ ఛానళ్లు బాగుపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కురిసే వర్షపు నీటిని చెరువుల్లో నిల్వ చేసుకుని సంరక్షించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పనులపై ప్రత్యేక దృష్టి సారించి, అందుబాటులో ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇరిగేషన్ ఇంజనీర్లకు సూచించారు.అలాగే విబిజి రామ్ జీ పథకం కింద గ్రామాల్లో పశువుల తొట్ల నిర్మాణం, పశుగ్రాసం పెంపకం చేపట్టాలని ఆదేశించారు. కనీసం 50 శాతం నీరు, తేమ ఉన్న చెరువుల కింద పశుగ్రాసం సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ చివరి వరకు నీటి లభ్యత ఉండే ప్రాంతాల్లో పశుగ్రాసం పెంపకానికి అనువుగా ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంత తదితరులు పాల్గొన్నారు.

రాచమల్ల భద్రయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు

రామన్నపేట నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం మాజీ జిల్లా నాయకులు రాచమల్ల భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సిపిఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భద్రయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ బోయిన ఆనంద్, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు నాగటి ఉపేందర్ మాట్లాడుతూ రాచమల్ల భద్రయ్య మరణం నీర్నేముల గ్రామానికి, నాయి బ్రాహ్మణ సంఘానికి తీరని లోటని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు బండా జగన్మోహన్ రెడ్డి, నేమనంది లింగయ్య, మునుగోటి అత్తయ్య, వార్డు సభ్యులు నాగటి ఉపేందర్, మాజీ వార్డు సభ్యులు నాగటి మహేష్, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, నాగటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



త్రినేత్ర హోటల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాలునాయక్

- యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడం అభినందనీయం: ఎమ్మెల్యే

దేవరకొండ, నవంబర్ 19,(ప్రజా జ్యోతి) :

దేవరకొండ పట్టణంలోని తాటికొల్ ఎక్స్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన త్రినేత్ర హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోటల్‌ను ప్రారంభించి, నిర్వాహకుడు జటావత్ సాయికుమార్‌కు శు భాకాంక్షలు తెలిపారు.నూతనంగా ప్రారంభించిన హోటల్ ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే యువతకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజా వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నరసింహ, హనుమంతు వెంకటేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రైయిస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, హనుమంతు సాయి చంద్ర, గుద్దేటి మాధవి సత్యం, కొర్ర రామ్ సింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





నకిరేకల్ నియోజకవర్గంలో యువకుడి మృతికి నివాళులర్పించిన దైద రవీందర్

నకిరేకల్: నల్గొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (ప్రజాజ్యోతి)

నకిరేకల్ నియోజకవర్గంలోని బాబు సాయిగూడెం గ్రామానికి చెందిన భూపతి రాజేష్ గౌడ్ (17) మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటపాక నాగయ్య, చనగాని నాగరాజ్, దాసరి రామచంద్రయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





శాలిగౌరారంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షల శిబిరం

శాలిగౌరారం / నల్లగొండ జిల్లా ప్రతినిధి

:నవంబర్ 19: (ప్రజా జ్యోతి)

శాలిగౌరారం: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ దామెర్ల శీను, డాక్టర్ దునుక వెంకన్న ప్రజలకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మంది గ్రామస్థులు ఈ శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించు కున్నారు.ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల ఆంజనేయులు, కోశాధికారి మురారి శెట్టి కరుణాకర్, వడ్లకొండ బిక్షం, గుండు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరానికి సహకరించిన వైద్యులకు, క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు.



పాఠశాలల్లో జల ప్రతిజ్ఞ -- గ్రామాల్లో నీటి సంరక్షణ పనుల పరిశీలన

నకిరేకల్/ నల్గొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 19: (ప్రజాజ్యోతి)

నెల్లిబండ: నీటిని సంరక్షిద్దాం -- జీవాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో బుధవారం నెల్లిబండ గ్రామ పంచాయతీతో పాటు పంచాయతీ పరిధిలోని హ్యాబిటేషన్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం, ఫారం పాండ్స్ పనుల పురోగతి, కిచెన్ గార్డెన్స్, బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్ మార్కింగ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయా పనుల్లో పురోగతి సాధించేలా కూలీలకు అవగాహన కల్పించి, పనుల పట్ల ప్రోత్సాహం అందించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేశారు.అలాగే పాఠశాల విద్యార్థులతో జల ప్రతిజ్ఞ చేయించి, నీటి విలువ, నీటి సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాఘవులు, టీఏ సూరయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





ఆడానియా నారాయణ సింగ్ మృతి బాధాకరం

- మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :

దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామానికి చెందిన ఆడానియా నారాయణ సింగ్ మృతి చెందడం బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.నారాయణ సింగ్ మృతి వార్త తెలుసుకున్న ఆయన కొండ భీమనపల్లి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కడారి సైదులు యాదవ్, గుండాల వెంకట్ యాదవ్, వార్డు సభ్యులు కడారి అచ్చయ్య యాదవ్, ఉపాధ్యాయులు మాండన్ నారాయణ సింగ్, మాండన్ ధర్మేందర్ సింగ్, మాండన్ కిషన్ సింగ్, పగిళ్ల వెంకట్ రాములు, నారాయణ సింగ్, తోనగర్ ప్రతాప్, మాండన్ విజయ్ సింగ్, అడాన్య అరణ్ సింగ్, అడాన్య పవన్, మాండన్ శ్యాంసింగ్, అడాన్య సీతారాం సింగ్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా కిషన్ నాయక్

- మృతుడి కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయం.. పిల్లల చదువులకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా

దేవరకొండ, నవంబర్ 19,(ప్రజా జ్యోతి) :

దేవరకొండ మండలం కమలాపురం గ్రామానికి చెందిన పల్లపు సైదులు మృతి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ అన్నారు.సైదులు మృతి విషయం తెలుసుకున్న ఆయన గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.35,000 అందజేశారు. అంతేకాకుండా సైదులు పిల్లల చదువులకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కిషన్ నాయక్ తెలిపారు.



బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత: పోలేపాక రామచంద్రు

- తూర్పు గూడెంలో లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పట్టాలను అందజేత

తుంగతుర్తి, నవంబర్ 19,(ప్రజా జ్యోతి):

ప్రజాపాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలేపాక రామచంద్రు అన్నారు. మండల పరిధిలోని తూర్పు గూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా, లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన 'చేయూత' పెన్షన్ల మంజూరు పత్రాలను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ దాసరి రేణుక శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక భద్రత మరియు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు వివిధ వృత్తులపై ఆధారపడిన అర్హులైన వారికి చేయూత పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు.నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన విధానాల ప్రకారం పెన్షన్ నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవీన్, ఉపసర్పంచ్ కల్యాణ్ ,పాలకవర్గం సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండగాని మిన్నయ్య, గుండగాని రమేష్, ఏరసాని లింగయ్య, దాసరి నరసయ్య, కన్నెబోయిన యాకయ్య, కొంతం శ్రీను, లింగంపల్లి లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాల నారాయణ గౌడ్ దశదిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన నేతి విద్యాసాగర్

కేతేపల్లి: / నల్గొండ జిల్లా ప్రతినిధి: నవంబర్ 19: (ప్రజా జ్యోతి)

నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉయ్యాల అంజయ్య గౌడ్ తండ్రి ఉయ్యాల నారాయణ గౌడ్ దశదిన కార్యక్రమం గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మాజీ శాసనమండలి చైర్మన్ గౌరవ నేతి విద్యాసాగర్ హాజరై ఉయ్యాల నారాయణ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ బొల్లా వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట పుల్లయ్య, దొడ్డయ్య శ్రీను తదితరులు పాల్గొని నారాయణ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు.



ఇసుక రవాణా అక్రమమా? సక్రమమా?

- పోలేపల్లి తండ నుంచి ఇసుక తరలింపుపై అధికారుల మౌనం ఎందుకు?

- ట్రాక్టర్లకు ఎవరి అండదండలు? మరో ప్రాణం బలయ్యే వరకు ఎదురుచూస్తారా?

దేవరకొండ , నవంబర్ 19 ,(ప్రజా జ్యోతి) :

చందంపేట మండలంలోని పోలేపల్లి మానవత్ తండ నుంచి నేరేడుగొమ్ము మండలంలోని వివిధ గ్రామాలకు ఇసుక ట్రాక్టర్ల ద్వారా పెద్దఎత్తున తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెల్లవారుజామున సైతం ట్రాక్టర్లు ఎలాంటి నియంత్రణ లేకుండా రహదారులపై తిరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బుధవారం తెల్లవారుజామున నేరేడుగొమ్ము తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ కుక్క మృతి చెందినట్లు స్థానిక వర్గాల సమాచారం. గతంలో పిల్లిగుండ్ల తండ సమీపంలో ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కూడా ఉందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు?పోలేపల్లి తండ నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు ఇసుక తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో పోలీసుల తనిఖీలు లేకపోవడంపై ప్రజలు పలు



అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రవాణాకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయా? సంబంధిత అధికారుల నిర్లక్ష్యమా? లేక అనుమతులతోనే ఇసుక తరలిస్తున్నారా? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి.మరోవైపు, ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా అక్రమ ఇసుక దందా సాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అవసరాన్ని ఆసరాగా చేసుకుని, లబ్ధిదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇసుక సరఫరా పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే అంశంపై అధికారులు విచారణ చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించాలిజిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి పోలేపల్లి మానవత్ తండ నుంచి జరుగుతున్న ఇసుక రవాణాపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు విరుద్ధంగా రవాణా జరుగుతోందా? అధిక ధరలకు విక్రయిస్తున్నారా? అనే అంశాలను పరిశీలించి, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇసుక రవాణా నిబంధనల ప్రకారం సాగాలి.. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలి. మరో ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూడకుండా ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించాలని నేరేడుగొమ్ము మండల ప్రజలు కోరుతున్నారు.

కాకతీయ సేవా సమితి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

- నిరుపేదలకు అంతర్జాతీయ స్థాయి కంటి వైద్యం అభినందనీయం

- మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, జెడ్పీ సీఈవో శిరీష

- విజయవంతంగా ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

- 650 మందికి పరీక్షలు,140 మందికి శుక్లాల శస్త్రచికిత్సలు



కోదాడ టౌన్ ,నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

సామాజిక సేవా రంగాలలో కోదాడ కాకతీయ సేవా సమితి అందిస్తున్న సేవలు భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, సూర్యాపేట జిల్లా పరిషత్ సీఈవో దేవరపల్లి శిరీష కొనియాడారు. శుక్రవారం దుర్గాపురం సమీపంలోని కాకతీయ సేవా సమితి కల్యాణ



మండపంలో గత పది రోజులుగా రావెళ్ల సీతారామయ్య సౌజన్యంతో, చెన్నై శంకర నేత్రాలయ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.?నిరుపేదలకు సైతం అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన కంటి వైద్య సేవలు, శస్త్రచికిత్సలను ఉచితంగా అందించడం ఎంతో అభినందనీయమని వారు ప్రశంసించారు. ఈ శిబిరంలో మొత్తం 650 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా,



వారిలో 140 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సేవా సమితి అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేమూరి సురేష్, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, పోటు రంగారావు, కాకర్ల వెంకటేశ్వరరావు, గంట సత్యనారాయణ, కనగాల నాగేశ్వరరావు, నాదెళ్ల బాలకృష్ణ, మారుతి మాధవరావు, కొత్త రాంబాబు, ముండ్ర రవికుమార్ శంకర నేత్రాలయ వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త రాములు మృతి బాధాకరం: డీసీసీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :

నేరడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వరికుప్పల రాములు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని డీసీసీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ అన్నారు.రాములు మృతి విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా రాములు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవారని గుర్తు చేశారు. ఆయన మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల మండల ఫోరం అధ్యక్షుడు పులికంటి సుధాకర్, ఉపసర్పంచ్ ఎలిజర్ల శ్రీను, వరికుప్పల సైదయ్య, నాగటి హరీష్, సంఘం యాదయ్య, వరికుప్పల రాజు, ఇరుగదిండ్ల అంజి, గ్రామస్తులు తదితరులు పాల్గొని రాములుకు నివాళులర్పించారు.



రాష్ట్రం లో బీసీ బందు పథకం అమలు చేయాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

తిరుమలగిరి అశోక్ డిమాండ్

మిర్యాలగూడ, నవంబర్ 19,(ప్రజాజ్యోతి):



తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు బీసీ బందు పథకం అమలు చేసి బీసీలను ఆర్థికంగా ఆదుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేద బీసీలకు, కులవృత్తుల అభివృద్ధికి ఆర్థిక భరోసాన్ని కల్పించి, బీసీల వెనకబాటుతనం నిర్మూలన దిశగా కాస్త ప్రయత్నం చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఆనాడు ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఆర్థిక వెనుకబాటు నిర్మూలన దిశగా ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తానని మాట ఇచ్చి మూడు సంవత్సరాలు పూర్తిస్థాయిలో గడిచినప్పటికీ కూడా నేటికీ బీసీ బందు పథకాన్ని నీరుగారిచే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బీసీల పోరుబాట పట్టక తప్పదన్నారు. బీసీల అభ్యున్నతికి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నేటికీ నెరవేర్చిన పాపాన పోలేదని,బీసీ వ్యతిరేక భావాలను అమర్చుకొని బీసీల అణచివేత దిశగా ప్రభుత్వం ముందుకు సాగడాన్ని బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన బీసీల ఆర్థిక భరోసా కి ప్రతి నిరుపేద కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి బీసీల సంక్షేమం కోసం ఆర్థిక వెనుకబాటు నిర్మూలన దిశగా ప్రభుత్వం అడుగులు వేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేసేందుకు బీసీలంతా సిద్ధమై ఉన్నారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి జేఏసీ కన్వీనర్ దాసరాజు జయరాజ్, బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు నాయిని భాస్కర్, పట్టణ కన్వీనర్ పట్టేటి రమేష్, కో కన్వీనర్ బోయిన ఉపేందర్, పట్టణ నాయకులు లక్ష్మణ్ తదితరు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుతో మిర్యాలగూడ అభివృద్ధి వేగవంతమవుతుంది

- మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్

మిర్యాలగూడ, నవంబర్ 19,(ప్రజాజ్యోతి):

మిర్యాలగూడ జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని మాజీ శాసనసభ్యులు రేపాల శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా ఏర్పాటు ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో జిల్లా కేంద్రాల అభివృద్ధికి, పనులకు ప్రత్యేక నిధులుకేటాయించబడతాయన్నారు. జిల్లా కేంద్రం నుండి వివిధ ప్రాంతాలకు రోడ్లు నిర్మాణాలు వస్తాయని, విద్యాసంస్థలు పెద్ద ఎత్తున వస్తాయని అన్నారు. విద్య వైద్యం అందుబాటులో ఉంటుందని వ్యాపార కేంద్రాలు అభివృద్ధి చెంది ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ అందుబాటులో ఉండే అవకాశం ఉన్నందున అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు, ప్రజలు, సామాన్యులు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రాలకు పోయే వ్యయ ప్రయాసలు తగ్గుతాయన్నారు. అనంతరం నూతన జిల్లా సాధన సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు తమ్మడబోయిన అర్జున్, మాలోతు దశరథ నాయక్, తిరుమలగిరి అశోక్, దాసరాజు జయరాజు, సర్నాల వెంకయ్య యాదవ్, షోయబ్ , మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు.. ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు..

అనంతగిరి, నవంబర్ 19 (ప్రజాజ్యోతి)

భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలను అనంతగిరి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్ రెడ్డి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముసుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ పేద ప్రజల సంక్షేమం, పేదరిక నిర్మూలన కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకురాలని కొనియాడారు. భూసంస్కరణల ద్వారా పేదలకు భూములు అందించడం, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో దేశాన్ని వ్యవసాయ రంగంలో అభివృద్ధి పథంలో నడిపించడం ఆమె దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.



పర్యావరణానికి ముప్పు తెచ్చే ఇథనాల్ పరిశ్రమ కు అనుమతులు ఇవ్వొద్దు ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయాలి

- సిపిఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, పోలేపల్లి ఉదయ్ కుమార్ ల డిమాండ్

దామరచర్ల, నవంబర్ 19,(ప్రజాజ్యోతి):

దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో నూతనంగా నెలకొల్పో బోతున్న సోహం ఆగ్రోస్ ఇథానాల్ ఫ్యాక్టరీ వల్ల పర్యావరణం,ప్రజల ఆరోగ్యంపై ముప్పు పొంచిఉందని ఇట్టి ఫ్యాక్టరీ కి అనుమతులు ఇవ్వద్దనీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ లు డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ దామరచర్ల మండలం సమితి సమావేశం ధీరావత్ లింగ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బంటు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మాణం చేపట్టేందుకు ఈనెల 20న, ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నారని దీనిని సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పూర్తిగావ్యతిరేకిస్తుందన్నారు.ఆ ఫ్యాక్టరీ వలన ప్రతి రోజు 450 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ నిత్యం విడుదల అవుతుందనీ దాని వలన శ్వాసకోస వ్యాధులు చిన్నపిల్లలకు వృద్ధులకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అన్నారు.వ్యవసాయ భూములు పూర్తిగా ధ్వంసం అయ్యే పరిస్థితి ఉందన్నారు.ఫ్యాక్టరీ కి ప్రతిరోజు 50 లక్షల లీటర్ల వాటర్ ను జీవనది కృష్ణా నది నుండి వాడతారని దీనివలన నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి ఉందన్నారు.ఫ్యాక్టరీ వాడే ఒక్కరోజు నీరు మండలంలోని ప్రజలందరికీ ఒక్కరోజు అన్ని అవసరానికి వాడుకోవచ్చుఅన్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం జరగకుండా దామరచర్ల మండల ప్రజలు మొత్తం పూర్తిస్థాయిలో వ్యతిరేకించాలని ఇక్కడ నిర్మాణం జరగకుండా చూడవలసిన బాధ్యత మండల ప్రజల మీద ఉందని వారన్నారు. ఈ ఫ్యాక్టరీ వలన వెలువడే పొల్యూషన్ చిన్నపిల్లలకు పెద్దలకు శ్వాస కోస వ్యాధి వచ్చే పరిస్థితి ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు కూడా చెప్పటంజరిగిందన్నారు.దామరచర్ల



మండలంలో గతంలో డక్కన్ కెమికల్ ఫ్యాక్టరీని పెట్టడం వలన పశువులు, అనేకం చనిపోయినటువంటి పరిస్థితి మనందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఈ సమావేశంలో జమ్ముల కోటయ్య,డి.శాంత, సీనియర్ పార్టీ నాయకులు గజ్జల లక్ష్మి నరసింహ రెడ్డి, లక్ష్మయ్య,దుర్గారావు తదితరులుపాల్గొన్నారు.

కరెంట్ షాక్ తో గేదె మృతి

- ట్రాన్స్ పారంకు గడ్డి తిగే అల్లుకోవడంతో ప్రమాదం

పెన్ పహాడ్ నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

మండలపరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన చిట్యాల గోపి తండ్రి వెంకన్న, పాడిరైతు ప్రతిరోజు గేదెలను పశుగ్రాసం కొరకు పొలాలదగ్గరికి వెళ్లి గేదెలను మేపుకొని వస్తుంటాడు,అదే క్రమంలో గురువారం గేదెలను మేపుకొని తిరిగి ఇంటికివస్తుండగా ట్రాన్స్ ఫార్మర్ కు గడ్డి, గడ్డితీగ అల్లుకొని ఉండడంతో ఆ గ్రాసాన్ని తినడానికి వెళ్లిన గేదె కరెంటుషాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.పాడిగేదె మృతిచెందడంతో రైతు ఆవేదన వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గేదె దర లక్షముప్పై వేల వరకు ఉంటుందని ఇట్టి నష్టపరిహారాన్ని అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



25 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్ పత్రాలు

ముఖ్యఅతిథిగా హాజరైన తూముల భుజంగరావు

పెన్‌పహాడ్, నవంబర్ 19(ప్రజా జ్యోతి):

మండల పరిధిలోని గాజుల మల్కాపురం గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ నాతాల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన 'చేయూత' పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు, సర్పంచ్ నాతాల వెంకట్ రెడ్డితో కలిసి 25 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ప్రభుత్వ చేయూత అందడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. నిరుపేదల ఆర్థిక భరోసా కోసమే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని నాయకులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒగ్గు రవి, ఉపసర్పంచ్ సొంటి ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లావణ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీరాములు,కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి,మాజీ జెడ్పీటీసీ పిన్నేని కోటేశ్వరరావు,మాజీ సర్పంచ్ బండి రామకృష్ణారెడ్డి, నాయకులు దొంతగాని గోపయ్య, బండి మధుసూదన్ రెడ్డి,కుందూరు వెంకటరెడ్డి,బండి రవీందర్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఘనంగా చేయూత పెన్షన్ ప్రొసీడింగ్ ఆర్డర్ల పంపిణీ

పెన్ పహాడ్, నవంబర్ 19(ప్రజా జ్యోతి):

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా, మండల పరిధిలోని చీదేళ్ళ గ్రామంలో నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను గురువారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వరికల్లు పద్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు మాజీ మార్కెట్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.కార్యక్రమ ప్రారంభంలో నాయకులంతా కలిసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన విశేష సేవలను కొనియాడారు. అనంతరం గ్రామ సర్పంచ్‌తో కలిసి అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్ ప్రొసీడింగ్ ఆర్డర్లను తూముల భుజంగరావు చేతులమీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నేని కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గుర్రం అమృతా రెడ్డి, పరేడి లింగారెడ్డి, విలాస కవి వెంకట్ రాజ్ పాల్గొన్నారు. వీరితో పాటు వార్డు మెంబర్లు గొట్టిపర్తి గోపయ్య, రాంబాబు, ఉపేందర్, వరికలు ప్రవీణ్, పరశురాములు, సంతోష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



సూర్యాపేటలో హామ్ ది కేఫ్ ప్రారంభం

- వినియోగదారుల మన్ననలు పొందాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వారి మన్ననలను పొందాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన హామ్ ది కేఫ్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాణ్యమైన, నమ్మకమైన సేవలను అందిస్తూ వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం కేఫ్ నిర్వాహకులు అబ్బోజు శ్రావణి, అబ్బోజు అభిజ్ఞ మాట్లాడుతూ తమ కేఫ్ నందు పిజ్జా,బర్గర్, షవర్మ, శాండివిచ్, బ్రౌనీ, మోమోస్, ఫ్రెంచ్ ఫ్రైస్, చికెన్ వింగ్స్, మోజీటోస్, మిల్క్ షేక్స్ లభిస్తాయని తెలిపారు.సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు తమను ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గురగంటి హేమసతీష్, అబ్బోజు విద్యులత, శరత్ కుమార్, నిధిశ్రీ, రాఘవరావు, సరోజ, ఉషశ్రీ, ఉదయశ్రీ, మాధవిలత, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.





ఇథనాల్ పరిశ్రమ ప్రజాభిసేకరణ ను రద్దు చేయాలంటూ తాసిల్దార్ కు సిపిఎం వినతి

దామరచర్ల, నవంబర్ 19,(ప్రజాజ్యోతి):

దామరచర్ల మండలంలో వీర్లపాలెం గ్రామంలో ఈనెల 20న సోహం ఆగ్రో ఇండస్ట్రీస్ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు పై నిర్వహించే ప్రజాభిసేకరణను రద్దు చేయాలని గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మండల తహసిల్దార్ కృష్ణయ్య కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మాలోత్ వినోద్ నాయక్ మాట్లాడుతూ వీర్లపాలెం శివారులో నూతనంగా నిర్మించబోతున్న ఇథనాల్ పరిశ్రమ వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని అన్నారు దీని వలన నీటి, వాయువు కాలుష్యం మరియు పచ్చని పంట పొలాలలో అడవులలో తిరిగే వన్యప్రాణులను సైతం ఉండలేని పరిస్థితులు ఉంటాయని అన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో వైటిపిఎస్ వలన అనేక రకాల ఇబ్బందులు చుట్టుపక్కల ప్రజలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికే వై టి పి ఎస్ వల్ల వచ్చే నీటి కాలుష్యం వల్ల కృష్ణా నదిలో సుమారు రెండు కిలోమీటర్ల వరకు నీటి కాలుష్యం ఏర్పడి నీటిలో ఉండే జీవరాసులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇలాంటి సమయంలో ఇటువంటి పరిశ్రమలు ఈ ప్రాంతంలో నిర్మించినట్లయితే కృష్ణ నదిపై నిర్మించబోయే దాదాపు రెండు పెద్ద లిఫ్టులను వచ్చే నీరు కూడా ఇకనుంచి రావాల్సి ఉంది కాబట్టి ఇటువంటి పరిశ్రమలకు అనుమతి ఇవ్వకూడదు అని అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కంపెనీ యాజమాన్యం వీర్లపాలెం మరియు చుట్టుపక్కల ఉండే గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన



తర్వాతే ఈ కంపెనీ యొక్క ప్రజాభి సేకరణ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కాబట్టి పై అన్ని విషయాలను అధికార యంత్రాంగంవిచారించిన తర్వాతనే ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతి ఇవ్వాలని వారు అన్నారు లేని పక్షంలో ఈ కంపెనీ నిర్మించబోయే చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను సమీకరించి వారికి పరిశ్రమ నుంచి వెలుపడే నష్టాలను వివరించి పెద్ద ఎత్తున చైతన్యవంతులను చేసి సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్ర నాయక్ సిఐటియు మండల కార్యదర్శి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారుల కు ఇచ్చిన హామీల జాడేది

- తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరుల స్ఫూర్తి తో కాంగ్రెస్ హామీలపై పోరాడుదాం
- ఇక్కిరి శ్రీనివాస్,ఆలేరు తెలంగాణ మలి దశ ఉద్యమకారుల కమిటీ కో - కన్వీనర్

ఆలేరు నవంబర్ 19 (ప్రజా జ్యోతి)



2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు జాడేదని ఆలేరు తెలంగాణ మలి దశ ఉద్యమకారుల కమిటీ కో కన్వీనర్ ఇక్కిరి శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తెలంగాణ మలిదశ ఉద్యమ కారుల కమిటీ సమావేశం ఆలేరు ఆర్య వైశ్య భవన్ లో జరిగింది.ఈ సమావేశంలో ఆలేరు తెలంగాణ మలిదశ ఉద్యమకారులు రాష్ట్ర కార్యదర్శి జంపాల శ్రీనివాస్, ఆర్.జనార్ధన్, ఎర్ర జాన్సన్,,ఆడెపు బాలస్వామి,మొరిగాడి అశోక్, కల్లెపు అడివయ్య, కర్రె అశోక్, రచ్చ రామనర్సయ్య, పద్మ సుదర్శన్, చిమ్మి అబ్బాయిలు,ముదిగొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బోగారంలో నూతన చేయూత పెన్షన్ల పత్రాల పంపిణీ

రామన్నపేట, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం బోగారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగింది.ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం ఆదేశాల మేరకు సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, ఎంపీడీవో శ్రీరాములు, సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మిగిలిన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంపల రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గోగు హరిప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీటీసీ గోగు పద్మ సత్తయ్య యాదవ్, మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెపూరి ఐలయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిరగొని నవీన్, పాలకవర్గ సభ్యులు గోగు ప్రమీల రమేష్ యాదవ్, మేడి అంజనేయులు, నేరటి మానస సురేష్ యాదవ్, కడారి పావని పాపయ్య, గోగు సురేష్ యాదవ్, చిరగొని శిల్పా నవీన్ యాదవ్, వనం అండాలు యాదగిరి, భోగ సహదేవ్, పంచాయతీ కార్యదర్శి ఏ. సుధా, చేనేత సంఘం చైర్మన్ వనం కిష్టయ్య, అంతటి మల్లేష్, జెల్ల దత్తాద్రి, బొడ్డుపల్లి లింగయ్య, కూనూరు మల్లేశం గౌడ్, మేడి



నరసింహ, రాపోలు సత్యనారాయణ, ఎండి ఇమామ్, జెల్ల గోపాల్, రాపోలు శంభయ్య, కూనూరు స్వామి, జెల్ల రఘురాములు, రాపోలు గణేష్, కూనూరు రామచంద్రం, గంపల గోపాల్ రెడ్డి, గండూరి వెంకటేశ్వర్లు, మేడి లచ్చయ్య, కడారి అభిలాష్, గ్రామ పెద్దలు, యువకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులే పాలకులు..

ఉపాధ్యాయులుగా మారిన చిన్నారులు!

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలనా దినోత్సవ వేడుకలు

నడిగూడెం, నవంబర్ 19, ప్రజా జ్యోతి:

శ్రీ కొల్లు పాపయ్య చౌదర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ ప్రభుత్వ, పాఠశాల స్థాయి బాధ్యతలను స్వీకరించి తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. నక్క నరసింహ ప్రధానోపాధ్యాయుడిగా, పల్లపు మహేష్ జిల్లా విద్యాశాఖాధికారిగా, కోట మనోజ్ కలెక్టర్‌గా వ్యవహరించి తమ పాత్రలకు న్యాయం చేశారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో పాఠాలు బోధించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విద్యార్థులు వివిధ హోదాల్లో బాధ్యతలు చేపట్టడం ద్వారా పరిపాలనా విధానాలు, అధికారుల బాధ్యతలు, విద్యా వ్యవస్థ పనితీరుపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు బోధనలోని అనుభవాలను తెలుసుకుంటూ తమలోని నాయకత్వ లక్షణాలను వెలికితీశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం, సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల



ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకున్నారు.కార్యక్రమం ముగింపు సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రఘు శ్రీదేవి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని వివిధ పాత్రలు పోషించిన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో సమర్థవంతమైన నాయకులుగా ఎదిగేందుకు ఎంతగానో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో స్వపరిపాలనా దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

బాధిత కుటుంబానికి అండగా బిఆర్ఎస్ పార్టీ

ఆలేరు నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేట గ్రామానికి చెందిన పుట్టల (గౌరి) రాంచంద్రయ్య అనారోగ్యంతో మర ణించడం జరిగింది. ఈ విషాద వార్త గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని బిఆర్ఎస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేసారూ.బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో భాగంగా మాజీ ఎంపీటీసీ రచ్చ రాంనర్సయ్య మరియు మాజీ ఉపసర్పంచ్ కంతి మహేందర్ మరియు 50 కిలోల బియ్యం అందజేశారు. వారికి ఈ మానవతా సహాయానికి గ్రామ పార్టీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు 8వ వార్డ్ మెంబర్ చిలుకు ప్రశాంత్, 9వ వార్డ్ మెంబర్ పుట్టల నరేష్,కళ్లెం తిరుమల్లేష్,కంతి రాజుకుమార్,పుట్టల కిష్టయ్య, పుట్టల, మార్కయ్య,కళ్లెం చంద్రయ్య, చిలుకు యాదగిరి, ,పుట్టల యాదగిరి,చిలుకు చంద్రశేఖర్,,ఆడెపు కర్ణాకర్,పుట్టల శేఖర్, కళ్లెం రవి, పుట్టల ప్రశాంత్,జెరి పోతుల పవన్ పాల్గొన్నారు.



పేదల సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసింది

ఆలేరు నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఇంటి స్థలా హామీలు ఉన్న దానిని మరిచి పేదలను సమస్యలను గాలికి ప్రభుత్వం వదిలేసిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా తాసిల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ కొలనుపాక గ్రామంలో సర్వేనెంబర్ 8 ప్రభుత్వ భూమి రెండెకరాల పేదలకు ఇంటి స్థలాలను ఇవ్వాలని రెండు సంవత్సరాల నుంచి సిపిఐ పార్టీ అనేక పోరాటాలను నిర్వహిస్తున్న క్రమంలో ప్రభుత్వం మాత్రం ఇంతవరకు పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కనకయ్య గ్రామ శాఖ కార్యదర్శి రవి మహిళా సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి జానమ్మ మండల కార్యవర్గ సభ్యులు కందుల మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పరుశురాములు, పోతు ప్రవీణ్ ఆండాలు భవాని యాదమ్మ శ్రీలత సుశీల తదితరులు పాల్గొన్నారు.



ఆలేరు డివిజన్ ఆత్మ కమిటీ డైరెక్టర్ గా మహేష్.

ఆలేరు నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి మహేష్ ఆలేరు డివిజన్ ఆత్మ కమిటీ డైరెక్టర్ గా ఎన్నిక కావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ తమ ఎన్నికకు సహకరించిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఆలేరు రైతు సోదరులకు వ్యవసాయ సాగు విధానంలో సాంకేతిక విజ్ఞానాన్ని సంబంధించిన సలహాలు సూచనలు తెలియజేయడంలోనూ ఎలినివో వంటి వర్షాభావ పరిస్థితులను తట్టుకునే నీటి పొదుపుకు సంబంధించిన సలహాలు సూచనలు ఇచ్చి రైతుల అధిక దిగుబడి సాధించడంలో కృషి చేస్తామన్నారు.



చదువులో పట్టుదల ఫలితాల్లో ప్రథమ స్థానం!

- డీఐఈఓ బి.సులోచన రాణి

గరిడేపల్లి,నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

విద్యార్థులు చదువులో పట్టు దల కనబరిచి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి బి.సులోచన రాణి సూచించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమె మండల కేంద్రంలోనీ పీ. ఎం.శ్రీ గడ్డిపల్లి మోడల్ జూనియ ర్ కళాశాలను గురువారం సంద ర్శించారు.ఈ సందర్భంగా అధ్యా పకులకు ఇంటర్ మొదటి సంవత్సరం నూతన సిలబస్, ప్రాక్టికల్స్ నిర్వహణపై పలు సూచనలు చేశారు.విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల సమయా న్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదవాలన్నా రు.నూరుశాతం ఉత్తీర్ణత సాధిం చి కళాశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రయోగశాలలను పరిశీలించి వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రసన్న కుమారి మాట్లాడుతూ డీఐఈఓ సూచనలను పాటిస్తూ మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్ర మంలో డి.నాగరాజు,సతీష్ కుమార్,శైలజ,వీరభద్రం, వెంకటేశ్వర్లు,చిన్న బాలయ్య, విష్ణువర్ధన్,శ్రవణ్ కుమార్,శాంతి ప్రియ,డాక్టర్ కందుల శివకృష్ణ, దామ్లా,మల్లికార్జున్ రెడ్డి,అనిల్, రాజష్, శ్రీను,అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు

శ్రీకారంచుట్టిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

వివో,గ్రామపంచాయతీ భవనాలు ప్రారంభం

దామరచర్ల లో 150 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ







మిర్యాలగూడ, నవంబర్ 19,(ప్రజాజ్యోతి):

భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ 109వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బి ఎల్ ఆర్).మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం లో, అడవిదేవులపల్లి మండలంలోని గోన్యా తండాలో, దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలు, మహిళా సంఘాల వివో భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ భవనాలు గ్రామీణ ప్రజలకు, మహిళా సంఘాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, గ్రామస్థాయి పరిపాలన మరింత సులభతరం కావడంతో పాటు మహిళా సంఘాల కార్యకలాపాలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.అనంతరం దామరచర్ల మండల కేంద్రంలో 150 నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమాల అనంతరం ఆయా గ్రామాల్లో మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ సమగ్రత, సమైక్యత, పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న గొప్ప నాయకురాలని కొనియాడారు.ఆమె ఆశయాలకుఅనుగుణం గా ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమానప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, మహిళా సంఘాల బలోపేతం, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

షిర్డీ సాయి మందిరంలో విశేష పూజలు, అన్నదానం

కోదాడ రూరల్ ,నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

మండలంలోని నల్లబండగూడెం రామాపురం క్రాస్ రోడ్డులో ఉన్న షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం సందర్భంగా ఆలయ చైర్మన్ నల్లపాటి నర్సింహారావు ఆధ్వర్యంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. షిర్డీ సాయిబాబా దర్శనం, పూజల కోసం ఉదయం నుండే బారులు తీరారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు సాయి శర్మ, ఆది నారాయణ, పూర్ణ, నాని, భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప సన్నిధిలో 'నీలి నీలి కన్నుల్లో'

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 19 (ప్రజాజ్యోతి):

పట్టణ కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం సినీ చిత్రీకరణతో సందడిగా మారింది. ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సారథ్యంలో బిగ్‌బాస్ ఫేమ్ అమర్‌దీప్ హీరోగా నటిస్తున్న 'నీలి నీలి కన్నుల్లో' అనే పాటను అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా చిత్రీకరిస్తున్నారు.ఈ పాట చిత్రీకరణ కోసం దేవాలయాన్ని ప్రత్యేకంగా పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయం వెనుక భాగంలో అయ్యప్ప స్వామి పడిపూజను తలపించేలా అద్భుతమైన సెట్‌ను ఏర్పాటు చేశారు. పూల అలంకరణలు, ఆధ్యాత్మిక వాతావరణం, ప్రత్యేక సెట్టింగ్‌లతో చిత్రీకరణ ప్రాంగణం భక్తిభావాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. పాటకు అనుగుణంగా శేఖర్ మాస్టర్ తనదైన శైలిలో కొరియోగ్రఫీ అందిస్తూ చిత్రీకరణను పర్యవేక్షిస్తున్నారు.బిగ్‌బాస్ కార్యక్రమం ద్వారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన అమర్‌దీప్ హీరోగా ఈ పాటలో నటిస్తుండటంతో చిత్రీకరణపై ఆసక్తి నెలకొంది. సినీ రంగంలో ప్రముఖ కొరియోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన శేఖర్ మాస్టర్ ఆధ్వర్యంలో పాట చిత్రీకరణ జరుగుతుండటంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



శభాష్ కోదాడ ట్రాఫిక్ పోలీస్..!

వాట్సాప్‌లో ఒక్క మెసేజ్.. సమస్యకు తక్షణ పరిష్కారం!

ప్రజల ఫిర్యాదుకు క్షణాల్లో స్పందించిన కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి....

పోలీసులంటే భరోసా అని చాటిన వైనం...!





కోదాడ టౌన్,నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి.. విధి నిర్వహణలో నిబద్ధత.. ప్రజా భద్రతే పరమావధిగా తక్షణ స్పందన.. ఇవే నిజమైన పోలీసింగ్‌కు నిదర్శనాలు. కోదాడ పట్టణ ట్రాఫిక్ పోలీసులు తమ పనితీరుతో మరోసారి ఇదే విషయాన్ని నిరూపించారు.పట్టణంలోని నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ సమీపంలో ఓ వ్యాపారి రోడ్డుకు అత్యంత సమీపంలో టేబుల్ ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తుండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ఏర్పడిన ఈ ఆక్రమణతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండటాన్ని గమనించిన ఓ వాహనదారుడు సమస్యను ట్రాఫిక్ పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు.వెంటనే ఆక్రమణకు సంబంధించిన ఫొటోలను తీసి వాట్సాప్ ద్వారా కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డికి పంపించాడు. అంతే.. ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని బాధ్యతగా స్వీకరించిన ఎస్ఐ అంజిరెడ్డి ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించారు. సిబ్బందితో కలిసి బస్టాండ్ ప్రాంతానికి చేరుకుని రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న నిర్వాహకులకు ట్రాఫిక్ నిబంధనలు, ఆక్రమణల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను వివరించారు. రహదారిపై ఉన్న ఆక్రమణను తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ప్రజల సమస్యను పరిష్కరించడానికి పెద్దగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఒక వాట్సాప్ సందేశంతోనే పోలీసుల దృష్టికి సమస్య చేరడం, దానికి వెంటనే పరిష్కారం లభించడం విశేషం.ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారులపై ఆక్రమణల నివారణలో పోలీసుల అప్రమత్తత ఎంత కీలకమో ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది. అదే సమయంలో ప్రజలు కూడా తమ పరిసరాల్లో ఎదురయ్యే సమస్యలను బాధ్యతాయుతంగా పోలీసుల దృష్టికి తీసుకురావడం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావచ్చనే సందేశాన్ని ఇచ్చింది.పోలీసులు అంటే కేవలం నిబంధనలు అమలు చేసే వ్యవస్థ మాత్రమే కాదు.. ప్రజల సమస్యలకు అండగా నిలిచే భరోసా అనే విషయాన్ని కోదాడ ట్రాఫిక్ పోలీసులు తమ చర్యతో చాటిచెప్పారు.వాట్సాప్ ద్వారా సమాచారం అందించిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, కోదాడ ట్రాఫిక్ పోలీసుల పనితీరుపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మన్ననలు పొందుతున్న పోలీసుల సేవలకు సోషల్ మీడియాలోనూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



పశుపోషణతో రైతులకు అధిక ఆదాయం

- దొండపాడులో పశువైద్య శిబిరం

చింతలపాలెం, నవంబర్ 19 (ప్రజా జ్యోతి) :



రైతులు పశువుల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారంపై తగిన శ్రద్ధ తీసుకుంటే పాడి పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దొండపాడు గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జువారి సిమెంట్ లిమిటెడ్ సహకారంతో (సిఎస్ఆర్ నిధులతో) నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువుల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఓట్స్ గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. పశువుల కోసం ప్రత్యేకంగా పశుగ్రాసం సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య, ఉప సర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పశువైద్యాధికారులు, జువారి సిమెంట్ సీఎస్ఆర్ సీనియర్ అధికారి డా. కరణం లుగేంద్ర పిళ్లై, కోదాడ ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు పెంటయ్య, పశువైద్యాధికారులు మధు, ఉషారాణి, శైలజ, సీడ్ సంస్థ ప్రతినిధులు ఎస్. నాగబ్రహ్మచారి, రవి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి ఆత్మ కమిటీ డైరెక్టర్ గా బాధ్యతలు

ఆలేరు నవంబర్ 19(ప్రజా జ్యోతి)

25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ ఒక నిబద్ధతతో పనిచేసిన శ్రీరాముల శ్రీనివాస్ కు ఆలేరు డివిజన్ ఆత్మ కమిటీ డైరెక్టర్ గా పదవి రావడం ఎంతో సంతోషకరమని చేనేత కార్మికులు తెలిపారు. అనంతరం శ్రీరాముల శ్రీనివాస్ మాట్లాడుతూ నా నియమకానికి సహకరించిన ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ ఎజాస్, ఆలేరు డివిజన్ చైర్మన్ పిక్క శ్రీనివాస్ కు ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ పదవికి న్యాయం చేస్తూ రైతులు చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



విద్యా ప్రగతిపై క్షేత్రస్థాయి పరిశీలన

- కల్మలచెరువు జడ్పీహెచ్ఎస్

పాఠశాలలో అకస్మిక తనిఖీ

గరిడేపల్లి,నవంబర్ 19(ప్రజా జ్యోతి):

విద్యార్థుల అభ్యసన సామర్థ్యా లు,పాఠశాలల్లో విద్యా ప్రమాణా ల పెంపుపై డిస్ట్రిక్ట్ అకడమిక్ ప్యానెల్ బృందం దృష్టి సారించిం ది.ఇందులో భాగంగా గరిడేపల్లి మండలం కల్మల్ చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది.పాఠశాలలో అమలవు తున్న అభ్యసన ఉన్నతి కార్యక్ర మాల తీరును పరిశీలించింది. విద్యార్థుల సామర్థ్యాలు,బోధ నాభ్యసన ప్రక్రియ,అకడమిక్, డిజిటల్ నిర్వహణతో పాటు ఫార్మేటివ్,సమ్మేటివ్ అసెస్‌మెం ట్ల అమలును బృందం సమగ్రం గా తనిఖీ చేసింది. విద్యార్థుల విద్యా స్థాయిని,పాఠశాల నిర్వ హణ తీరును పరిశీలించి ఉపా ధ్యాయులకు పలు సూచనలు చేసింది.బోధనా పద్ధతుల్లో అవసరమైన మార్పులు చేపడు తూ విద్యార్థుల్లో అభ్యసన సామ ర్థ్యాలను పెంపొందించాలని సూచించింది.ఈ తనిఖీలో ప్యానెల్ బృందం ఇన్‌చార్జి, నోడల్ అధికారి మండవ ఉపేందర్, ప్రధానోపాధ్యాయు డు పిడమర్తి వీరబాబు,బృంద సభ్యులు జాఫర్, బూర వెంకటేశ్వర్లు,సైదులు, జానకి రాములు,మండవ సైదులు, ఆనంద్ భాస్కర్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పింఛన్‌దారుల జీవితాల్లో కొత్త వెలుగులు

చెన్నకేశవపురంలో 21 మందికి నూతన పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

సర్పంచ్ గోసుల రాజేష్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం

నడిగూడెం, నవంబర్ 19, ప్రజా జ్యోతి,

అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా చెన్నకేశవపురం గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ పత్రాలను గురువారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 21 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.నూతనంగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. పింఛన్లు వృద్ధులకు, దివ్యాంగులకు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మొక్క బిక్షపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, ఎంపీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి జి. సురేష్, ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య పాల్గొన్నారు.అలాగే వార్డు సభ్యులు పప్పుల ఉపేందర్, సంకోజు కర్ణాచారి, కలకొండ మనోజ్, శివరాత్రి వీరబాబు, పప్పుల ఉమా, పచ్చిగోళ్ల స్వరూప, దారా విజయ, సింగిల్ విండో చైర్మన్ నాగిరెడ్డి సంధ్య, లింగారెడ్డి, నడిగూడెం సర్పంచ్ దున్న శీను, కాంగ్రెస్ మండల నాయకులు కాసాని శివ, దేవబత్తిని రమేష్, ప్రసాద్, పల్లపు శీను, పాతకోట్ల నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి అర్జున్ రావు, అనంతుల ఉపేందర్, సంకోజు జానయ్య తదితరులు పాల్గొన్నారు.



టీఎస్ యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 19 (ప్రజాజ్యోతి)

పట్టణ కేంద్రంలో టీఎస్ యుటిఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల మహాసభలో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మునుగోటి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా ఉమ్మెత్తల అనురాగ్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె. మనోహర్, కంకణాల సంధ్యారాణి, కోశాధికారిగా మందడి లక్ష్మారెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా స్వర్ణలతతో పాటు పలువురు వివిధ పదవులకు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ముక్కెర్ల యాదయ్య, పరిశీలకుడిగా ఎస్. జ్ఞానేశ్వర్ రెడ్డి వ్యవహరించారు.ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ ప్రకటించి, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మోడల్ స్కూల్ సిబ్బందికి 010 పద్దు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే అంశంపై అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విధివిధానాలు రూపొందించాలని కోరారు.



ఉక్కు మహిళ ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

నడిగూడెంలో ఘనంగా జయంతి వేడుకలు.. నివాళులర్పించిన ఏపూర్ తిరుపతమ్మ సుధీర్

నడిగూడెం, నవంబర్ 19, ప్రజా జ్యోతి:

భారతదేశ తొలి మహిళా ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఎంసీ చైర్‌పర్సన్ ఏపూర్ తిరుపతమ్మ సుధీర్ కొనియాడారు. గురువారం నడిగూడెంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పందిరి వెంకారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఇందిరా గాంధీ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయీకరణ, హరిత విప్లవం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశ అభివృద్ధికి ఇందిరా గాంధీ విశేష కృషి చేశారని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడటంలో ఆమె చూపిన ధైర్యసాహసాలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. నేటి తరం నాయకులు, కార్యకర్తలు ఆమె ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దున్నా శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎలుగూరి నాగరాజు, పల్లపు శ్రీనివాస్, గుండు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దేశ ఐక్యతలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

ప్రిన్సిపాల్ మల్లేశం

భువనగిరి, నవంబర్ 19(ప్రజాజ్యోతి)

భువనగిరి పట్టణం లోని,జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల భువనగిరి ఎన్ఎస్ఎస్,యూనిట్స్ 1,2,3,ఆధ్వర్యంలో నేషనల్ ఇంటిగ్రేషన్ డే (జాతీయ సమైక్యత దినోత్సవం) సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు" జాతీయ సమైక్యతను కాపాడుటలో విద్యార్థుల పాత్ర"అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ మల్లేశం మాట్లాడుతూ భారత దేశంలో విభిన్న మతాలు విభిన్న భాషలు విభిన్న ఆచారాలు కలిగి ఉన్నప్పటికీ మన దేశ ఐక్యతను కాపాడుటలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అదేవిధంగా జాతీయ సమైక్యత ని సాధించడంలో ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం లోని వాలంటరీల పాత్ర ఎంతో ముఖ్యమైనదని సూచించారు ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికీ బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేష్ సుధా కిషోర్ ఇస్తారి మరియు అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



పోచంపల్లి అర్బన్ బ్యాంకుకు ఎక్సలెన్స్ అవార్డు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 19 (ప్రజాజ్యోతి)

న్యూఢిల్లీలోని అశోక హోటల్‌లో గురువారం నిర్వహించిన ఇండియన్ కో-ఆపరేటివ్ సమ్మిట్ అండ్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026లో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎక్సలెన్స్ ఇన్ ఎన్‌పీఏ మేనేజ్‌మెంట్ అవార్డును గెలుచుకుంది. నాబార్డ్ డైరెక్టర్ సతీష్ మరాఠే, నాఫ్‌కబ్ చైర్మన్ లక్ష్మీదాస్ చేతుల మీదుగా బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈఓ సీత శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. బ్యాంకులో ప్రస్తుతం రూ.400.99 కోట్ల డిపాజిట్లు, రూ.291.98 కోట్ల రుణాలు ఉన్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డు సాధించడంపై బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు, ఖాతాదారులు, వాటాదారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు క్రిష్ణవేణి విద్యార్థి ఎంపిక

రామన్నపేట నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

రామన్నపేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ఏళ్ల శ్రీవిద్య జాతీయ స్థాయి స్పీడ్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్పీడ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్





ఆధ్వర్యంలో బుధవారం చిట్యాల లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీవిద్య జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ లో డిసెంబర్ 20, 21, 22 తేదీలలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో తెలంగాణ జట్టు తరఫున ఆమె పాల్గొంటుందని ఆయన తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీవిద్యను, ఆమెకు శిక్షణ ఇచ్చిన పి ఈ టి కల్పన ను గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ నరేందర్ రెడ్డి తో పాటు ప్రిన్సిపాల్ బి సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జెవిఎన్ఎస్ మణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రషీద్, మురళి, అలీమోద్దీన్, సత్తయ్య, ఉమారాణి, పూనందాస్, వినోద, ఆసియా, లావణ్య, మహాలక్ష్మి, శ్రావణి, విజయలక్ష్మి, మమత, చైతన్య ,మానస, శైలజ తదితరులు అభినందించారు.

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

రామన్నపేట, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు సుభాష్ సెంటర్ లో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అర్జున వాడ యూపీఎస్ హైస్కూల్ లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు గంగుల వెంకటరాజు రెడ్డి, కొత్తపల్లి అబ్రహం కుమార్,



పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు సాల్వేర్ అశోక్, బొడ్డు సాలయ్య, వనం చంద్రశేఖర్, మొహమ్మద్ నాసర్, గుత్తా నర్సిరెడ్డి, కోట సుధాకర్, రాయిని రమేష్, మొహమ్మద్ అక్రం, గోదాసు శ్రీమన్నారాయణ, రాపోల్ రాజశేఖర్, నూతి పరుశురాం గౌడ్, బొడ్డు శంకరయ్య, మొహమ్మద్ మన్సూర్ అలీ, మహమ్మద్ రిజ్వాన్, గట్టు యాదయ్య, కక్కిరేణి రవీందర్, మొహమ్మద్ అజార్, గంగాపురం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నాటుసారా తయారీపై ఉక్కుపాదం.. సీత్లా తండాలో ఎక్సైజ్ దాడులు

- 10 లీటర్ల నాటుసారా స్వాధీనం....

ఒకరిపై కేసు నమోదు

గరిడేపల్లి,నవంబర్ 19(ప్రజా జ్యోతి):

మండల పరిధిలోని సీత్లాతండాలో అక్ర మ నాటుసారా తయారీపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు.ఈ తనిఖీల్లో నాటుసారా తయారీకి సిద్ధం గా ఉంచిన సుమారు 300 లీటర్ల బెల్లం వాష్‌ను,నిల్వ ఉంచిన 10 లీటర్ల నాటు సారాను అధికారులు ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి వినియోగిస్తున్న డిస్టిలేషన్ సెటప్‌లతో పాటు ఇతర పరి కరాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అధికా రులు తెలిపారు.నాటుసారా తయారీ, విక్రయాలు,వినియోగం ప్రజల ఆరోగ్యాని కి తీవ్ర హాని కలిగించడమే కాకుండా కు టుంబాల ఆర్థిక పరిస్థితిపై,సమాజ శాం తి భద్రతలపై ప్రతికూల ప్రభావం చూపు తాయని అధికారులు పేర్కొన్నారు.ఎక్క డైనా అక్రమంగా నాటుసారా తయారు



చేస్తున్నా,విక్రయిస్తున్నా ప్రజలు వెంట నే ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.నాటుసారా రహి త సమాజ నిర్మాణానికి ప్రజలందరూ స హకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీ ల్లో ఎక్సైజ్ సీఐ నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పుట్ట శ్రీను,ప్రభాకర్,గోపి రెడ్డి, చిన్ని పాల్గొన్నారు.

తిరుమలగిరిలో ఘనంగా గ్రామ సర్వసభ్య సమావేశం

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా,

చేయూత పింఛన్లపై గ్రామస్తులకు అవగాహన

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :

పీఏ పల్లిమండల పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో గురువారం గ్రామ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బెల్లి





కృష్ణమ్మ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, చేయూత పింఛన్ల పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బెల్లి కృష్ణమ్మ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, చేయూత పింఛన్లకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం తదితర అంశాలను వివరించి, గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రముఖులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ.. పేదల ఇంట ఆనందం.!

- సిరికొండలో ఘనంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం

- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆదేశాలతో లబ్ధిదారులకు పింఛన్ల అందజేత

- సర్పంచ్ బొర్రా వెంకటేష్, చేతుల మీదుగా పంపిణీ

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి

మోతె నవంబర్19(ప్రజా జ్యోతి)



పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు లబ్ధిదారుల జీవితాలకు భరోసాగా నిలుస్తున్నాయని సిరికొండ గ్రామ సర్పంచ్ బొర్రా వెంకటేష్ అన్నారు. కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి ఆదేశాల మేరకు మోతె మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ కో ఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి,ఉపసర్పంచ్ రావుల రాజీవ్, కార్యదర్శి సురేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి , వార్డు సభ్యులు ఉప్పల వినోద్, అభిమల్ల వినోద్, రాజేష్, నిర్మల, మామిడి వెంకన్న, యాక్ పాషా, కంపాటి మహేశ్వరి నాయకులు తదితరులు పాల్గొన్నారు...

నాగార్జున పాఠశాలలో పురుషుల దినోత్సవ వేడుకలు

రామన్నపేట, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

నాగార్జున పాఠశాలలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న పురుష ఉపాధ్యాయులు, సిబ్బంది సేవలను గుర్తిస్తూ మహిళా ఉపాధ్యాయినులు వారికి బహుమతులు అందజేసి సన్మానించారు. కరస్పాండెంట్ డాక్టర్ నకిరేకంటి నాగరాజు మాట్లాడుతూ ఒక విద్యాసంస్థ అభివృద్ధిలో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి కృషి ఎంతో విలువైనదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులందరి పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యత, అంకితభావం, క్రమశిక్షణతో పని చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నకిరేకంటి రేఖ, మిర్జా అక్రమ్ బేగ్, లిబుమోన్, లక్ష్మీదేవి, అండాలు, సుస్మిత, నాజియా, ప్రసన్న, పూజ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ఆలేరు నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలను యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి గ్రామ సర్పంచ్ భూమశీర్ల జయమ్మ శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బుగ్గ కొమరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా దేశానికి ఇందిరా గాంధీ అందించిన సేవలను, దేశ సమగ్రత మరియు అభివృద్ధి కోసం చేసిన కృషిని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్మరించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నెమ్మని సుబ్రహ్మణ్యం, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బోయిని ఝాన్సీ ,యూత్ కాంగ్రెస్ నాయకులు క్యాస గళ్ల చందు ,ఆత్మ డైరెక్టర్ రేగు రమేష్ ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూమశీర్ల ఇస్తారి ,వంగాల మల్లేష్ ,గిరబోయిన మల్కాయ ,బీరకాయల యాదగిరి ,యూత్ కాంగ్రెస్ నాయకులు సంఘ శేఖర్ రెడ్డి ,బుగ్గ మహేష్ ,బొట్ల నాగులు, కొల్లూరు రంజిత్ ,రఘు రాములు, వస్పరి లింగం ,దయ్యాల పాండు, రేగు నర్సింలు ,మోటీ అంజయ్య ,మల్గ రమేష్, మరి కుక్కల మహేష్ ,మరి కుక్కల నరేష్ ,రేగు బాలరాజు ,మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల కవిత,మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పచ్చిమట్ల మాధవి ,వంగపెల్లి చామంతి తదితరులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమమే ఇందిరాగాంధీ లక్ష్యం...

- దేశ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప నాయకురాలు

- మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి

హాలియా, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

దేశంలో పేదరిక నిర్మూలనతో పాటు పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎనలేని కృషి చేశారని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు. ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గురువారం హాలియా పట్టణంలోని ప్రధాన కూడలిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా పనిచేసిన సమయంలో దేశ అభివృద్ధికి అనేక కీలక సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన గొప్ప నాయకురాలని కొనియాడారు. బ్యాంకుల జాతీయీకరణ ద్వారా సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేసి, ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఆమె చూపిన మార్గంలో పయనిస్తూ పేదల అభ్యున్నతికి, సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ కుందూరు వెంకట్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ సలహాదారులు చిట్టిప్రోలు కరుణాసాగర్, మజహర్ మొహినుద్దీన్, నేర్మటి వెంకట్ రెడ్డి, పాంపాటి శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి

- వారసత్వ సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత:

ఇంటాక్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల ధనంజయ

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :

చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తూ మన ప్రాంత చరిత్ర, కళలు, సంస్కృతి, పర్యాటక వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నల్గొండ జిల్లా ఇంటాక్ చాప్టర్ అధ్యక్షుడు లయన్ సముద్రాల ధనంజయ అన్నారు.ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్), పురావస్తు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దేవరకొండలోని గాంధీ విగ్రహం నుంచి ఖిల్లా దుర్గం వరకు విద్యార్థులతో వారసత్వ నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి జెండా ఊపి నడకను ప్రారంభించారు. వందలాది మంది విద్యార్థులు 'వారసత్వ సంపదను కాపాడాలి', 'మన చరిత్ర – మన ఊరు' అనే నినాదాలతో నడకలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లా దుర్గం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, అందులోని ప్రతి కట్టడం వెనుక గొప్ప చారిత్రక నేపథ్యం ఉందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే పురాతన కట్టడాలు, వారసత్వ సంపదను పరిరక్షించుకోవడం సాధ్యమవుతుందని



పేర్కొన్నారు.ఇంటాక్ నల్గొండ జిల్లా సభ్యుడు ముసిని అంజన్ మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లాలోని శిల్పాలు, శాసనాలు, పురావస్తు అవశేషాలతో పాటు జానపద కళలు, ప్రజల ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు ఈ ప్రాంత చరిత్ర, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని అన్నారు. వీటిని పరిరక్షించేందుకు ఇంటాక్ కృషి చేస్తోందని తెలిపారు.వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం, అద్భుతమైన శిల్పకళా సంపద కలిగిన దేవరకొండ ఖిల్లాను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లాకు ప్రపంచస్థాయిలో గుర్తింపు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఒకటో వార్డు కౌన్సిలర్ గుండాల పద్మ అంజయ్య యాదవ్



మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పర్యాటక, పురావస్తు శాఖల సమన్వయంతో శిథిలావస్థకు చేరుతున్న కోటలను పరిరక్షించి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అధికారి శక్రు నాయక్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు బండి నరేష్, మాజీ అధ్యక్షుడు తడకమళ్ల భిక్షమయ్య, ఆల్తాఫ్, గార్లపాటి శ్రీను, అంకురి ప్రసాద్, పగిడిమర్రి యాదగిరి, బత్తుల సురేష్, పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు చెరుపెల్లి జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సంఘీశెట్టి జ్యోత్స్న, గంజి యాదమ్మ, మునగపాటి చంద్రకళ, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ఆశీర్వాదం అందించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :

నేరడుగొమ్ము మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నగేష్--ప్రమీల దంపతుల కుమార్తె వర్షిని, కుమారులు వర్షిత్, అభిరామ్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులను ఆశీర్వదించి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- ఎన్‌హెచ్-65పై యూటర్న్ వద్ద టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టిన కారు

చివ్వెంల నవంబర్ 19(ప్రజాజ్యోతి):

జాతీయ రహదారి-65పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటన గురువారం ఉదయం 5.50 గంటల సమయంలో చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండ్రుగొండ గ్రామానికి చెందిన మెడబోయిన ఎల్లయ్య (48) తన పొలం నుంచి టీవీఎస్ ఎక్సెల్ (ూూా 24 ూూజీ 1336) వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నాడు.ఈ క్రమంలో ఎన్‌హెచ్-65పై ఎంఎస్ఆర్ స్కూల్ ఎదురుగా ఉన్న యూటర్న్ వద్దకు చేరుకోగానే,కోదాడ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు (ా+ 07 వీ 2471) వెనుక నుంచి వేగంగా వచ్చి అతని వాహనాన్ని ఢీకొట్టింది.కారు డ్రైవర్ పిట్టల రామకృష్ణ అతివేగం,అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. కారు ఢీకొట్టడంతో ఎల్లయ్య రోడ్డుపై పడిపోగా తలకు, కాళ్లకు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి భార్య మెడబోయిన లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చివ్వెంల ఎస్సై వి.మహేశ్వర్ తెలిపారు.





బాబోయ్ హానికారక ఇథనాల్ పరిశ్రమ వద్దే వద్దు

తెలంగాణ మట్టిమనిషి పాండురంగరావు

మిర్యాలగూడ,నవంబర్ 19, (ప్రజాజ్యోతి):

మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ దామరచర్ల మండలం వీర్లపాలెం శివారుల్లో నిర్మించే హాని కారక ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు మానుకోవాలని తెలంగాణ మట్టిమనుషులు వేనేపల్లి పాండురంగ రావు, కువ్వకుల హరీష్ కోరారు.గురువారం పత్రికలకు విడుదల చేసిన ప్రెస్ నోట్ లో వారు పేర్కొంటు తాగటానికే నీళ్లు దొరకవేమో అనే సంక్షోభంలో లక్షల లీటర్ల నీళ్లు పరిశ్రమ కు కేటాయించడం క్షమార్హం కాని నేరమన్నారు.పశువులకు, జంతువులకు,పక్షులకు మేత కావాల్సిన సొప్ప, గడ్డి ఇలా మండించడం ద్వారా నోటికాడి కూడునులాక్కోవద్దన్నారు.ఇప్పటికే దామరచర్ల కృష్ణపట్టి,పల్నాడు ఎండలకు ఉష్ణోగ్రతలకు దేశంలోనే రెంటచితల పేరు నమోదు అయ్యిందన్నారు.దీనికి తోడు అటు సిమెంట్ పరిశ్రమలు, ఇటు ధర్మల్ విద్యుత్ కేంద్రంతో ఈ ప్రాంతమంతా పూర్తిగా కలుషితం అయ్యిందన్నారు. ఇక్కడ నల్లమల ఆటవీ ప్రాంతం చెట్లు పక్షులు జంతువులు ముఖ్యంగా కుందేళ్లు, జింకలు తిరుగుతుండేవి వీటన్నిటిని నాశనం చేసుకుని మనం బావుకునేది ఏముందని ప్రశ్నించారు. నిజంగా ఇథనాల్ పరిశ్రమగురించి తెలుసుకోవాలి అనుకుంటే నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు వెళ్లి చూడాలన్నారు.అక్కడ ఏం జరుగుతుందో ఎందుకు మనము వ్యతిరేకించాలో తెలుస్తుందన్నారు. ఇథనాల్ పరిశ్రమలకు వ్యతిరేకంగా తెలంగాణలో బలమైన ఉద్యమాలు జరుగుతున్నా యన్నారు. పర్యావరణ పోరాటాల పలితంగా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కొన్ని సంస్కరణలు అమలు చేసారన్నారు. అందులో ఒకటి



పర్యావరణ ప్రభావాల నివేదిక ఒకటన్నారు. ఇప్పటి వరకు ఒక్క నివేదిక కూడా సరైంది ఏ కంపెనీ ఇవ్వలేదన్నారు. అన్ని అబద్ధాలు,తప్పులు, అభూతకల్పనలే అన్నారు.ఇథనాల్ పరిశ్రమ గురించి పుట్టెడుఅబద్ధాలున్నాయన్నారు.ప్రజలు ప్రజా సంఘాలు,రాజకీయపార్టీలు,బుద్ధి జీవులు దీన్నిఎదురుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజాస్వామికంగా వ్యవహరిశీచాలన్నారు. పోలీసులు రాజ్యాంగ బద్ధంగా చట్టాన్ని అమలుచేయాలన్నారు. పాలకులు ఏది చెబితే అది చేయకండని హితవు పలికారు . చట్టాన్ని చేతుల్లోకి తీసు కోకండన్నారు. ప్రజల మీద ప్రతాపం చూపకండని కోరారు .

కులం పేరుతో దూషించి..

మహిళా కార్మికురాలిపై కర్రతో దాడి..

- మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు..

- నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు..

- టూ టౌన్ ఎస్సై డి. సైదాబాబు

నల్లగొండ, నవంబర్ 19 (ప్రజాజ్యోతి):

నల్లగొండ పట్టణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిపై కులం పేరుతో దూషిస్తూ కర్రతో దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో బాధితురాలికి గాయాలు కాగా, ఆమెను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఘటనపై నల్లగొండ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న సుమారు 45 ఏళ్ల దళిత మహిళ గురువారం ఉదయం 8.05 గంటల సమయంలో తన తోటి కార్మికురాలితో కలిసి మున్సిపల్ ట్రాక్టర్‌పై చెత్త సేకరణ విధుల నిమిత్తం పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఆనంద్‌నగర్ 45వ డివిజన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఇళ్ల వద్ద చెత్తను సేకరిస్తుండగా, అదే ప్రాంతానికి చెందిన సూత్రావి బాలకృష్ణ (41) తన ఇంటి ముందు ఉన్న ఇసుక బస్తాను ఎందుకు తొలగించలేదంటూ ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా కులం పేరుతో అవమానిస్తూ, కర్రతో ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి కాళ్లపై పలుమార్లు కొట్టడంతో గాయాలయ్యాయి. వెంటనే అక్కడే ఉన్న తోటి కార్మికులు ఆమెను రక్షించి చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూ టౌన్ ఎస్సై డి. సైదాబాద్ తెలిపారు.



ట్రాక్టర్ బోల్తా పడి ఒరిస్సా వలస కార్మికుడు మృతి

మోటకొండూరు మండలంలో విషాద ఛాయలు

ఆలేరు, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)







యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వద్ద ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 22 సంవత్సరాల వయసు గల ఒరిస్సా వాసి, కాటేపల్లి శివారులోని ఇటుక బట్టీ వద్ద ఉంటూ కూలీ పనులు చేసు కుంటున్నాడు. ఇటుకలు తయారు చేసే క్రమంలో గ్రిల్ ఉన్న ట్రాక్టర్‌తో ఎర్రమట్టిని తొక్కిస్తున్నాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా ట్రాక్టర్ అదుపుతప్పి ఆ యువకుడు పైకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడు మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వలస వచ్చి పొట్టకూటి కోసం పనిచేస్తున్న యువకుడు ఇలా మృత్యువాత పడటంతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పారిశుధ్య కార్మికురాలిపై దాడి.. నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు

విధి నిర్వహణలో ఉన్న కార్మికులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, జిల్లా ప్రతినిధి నవంబర్ 19: (ప్రజా జ్యోతి)

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికురాలు సందుపట్ల రమణమ్మపై దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గురువారం 45వ డివిజన్‌లో విధి నిర్వహణలో ఉన్న రమణమ్మపై బాలకృష్ణ అనే వ్యక్తి దాడి చేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తక్షణమే స్పందించారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌తో పాటు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం ఈ ఘటనపై స్పందిస్తూ, పారిశుధ్య కార్మికురాలిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పారిశుధ్య కార్మికులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, అలాంటి వారిపై దాడులకు పాల్పడటం బాధాకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఘటనను జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు.విధులు నిర్వహిస్తున్న కార్మికులపై ఎవరైనా దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులు ఎంతో కష్టపడి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సేవలందిస్తున్నారని, వారి సేవలను గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

తండ్రికి తలకోరివి పెట్టిన కూతురు కంటే కూతుర్లనే కనాలి రా

రామన్నపేట, నవంబర్ 19(ప్రజా జ్యోతి)





తనకు కొడుకు లేకున్నా అల్లారు ముద్దుగా పెంచుకున్న తన కూతురే తన ఆస్తిగా భావించిన తండ్రికి తలకోరివి పెట్టి అందరి హృదయాలను కలచి వేసిన సంఘటన రామన్నపేట మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది.పట్టణ కేంద్రానికి చెందిన లవణం దశరథ వయసు(63) ఆటో డ్రైవర్ గా పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఇతనికి భార్య పుష్పతో పాటు ముగ్గురు కుమార్తెలు శ్వేత, స్వప్న, లలిత ఉన్నారు. ఆటో డ్రైవర్ గా పనిచేస్తూనే వారి వివాహాలు చేశాడు.తన చిన్న కుమార్తె దగ్గరకు బుధవారం యాదగిరి గుట్టకు వెళ్లాడు. అక్కడే గుండె నొప్పి రావడంతో వారు భువనగిరి దవాఖానాకు తీసుకెళ్లగా డాక్టర్లు పరిశీలించి చనిపోయినట్లు నిర్ధారించారు. స్వగ్రామమైన రామన్నపేటకు తీసుకొచ్చి అంత్యక్రియలను నిర్వహించారు.దీంతో పెద్ద కూతురు శ్వేత ముందు నడిచి తండ్రికి తలకోరివి పెట్టింది. కొడుకులు లేకున్నా తన తండ్రికి ఎలాంటి లోటు రాకుండా కూతురు తలకోరివి పెట్టడంతో పాటు అన్ని కార్యక్రమాలు ముందుండి కూతుర్లు చేయడంతో బంధువుల, గ్రామస్తుల కండ్లు చెమర్చాయి .

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు మంజూరు చేయాలి - రాపోలు నరసింహా నేత

రామన్నపేట, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)



చిన్న చిన్న కారణాలతో పేదల పెన్షన్ దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని, వాస్తవ పరిస్థితులను పరిశీలించి న్యాయం చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నిర్మలా నరసింహా నేత ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా రామన్న పేట ఎంపీడీవోను కలిసి వినతి పత్రం సమర్పించారు. చేయూత పెన్షన్ల దరఖాస్తులను చిన్న కారణాలు చూపుతూ నిరాకరించడం పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు.నేటి పరిస్థితుల్లో జీవనోపాధి కోసం కొందరు పాత కార్లను కొనుగోలు చేసి రవాణా పనులకు ఉపయోగించుకుంటున్నారని, పాత ట్రాక్టర్లు ఉన్నా వాటిని వ్యవసాయం, ఉపాధి అవసరాల కోసం వినియోగిస్తున్నారని తెలిపారు. అటువంటి వాటిని విలాసవంతమైన ఆస్తులుగా పరిగణించి పెన్షన్లను నిరాకరించడం సమంజసం కాదన్నారు. చిన్న స్థలం లేదా పాత వాహనం ఉన్నంత మాత్రాన వారు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నారని భావించడం సరికాదని పేర్కొన్నారు.అధికారులు కేవలం నిబంధనలు, రికార్డుల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వాస్తవ ఆర్థిక పరిస్థితులను పరిశీలించాలని కోరారు. వారి వద్ద ఉన్న ఆస్తులు విలాసాల కోసం వినియోగిస్తున్నారా, లేక కుటుంబ జీవనోపాధి కోసం ఉపయోగిస్తున్నారా అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. 2023 కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని 34వ పేజీ, 24వ అంశంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నప్పటికీ ఎలాంటి షరతులు లేకుండా పెన్షన్లు అందిస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ప్రస్తుతం పేదల దరఖాస్తులపై అనేక ఆంక్షలు విధించడం, చిన్న కారణాలతో తిరస్కరించడం బాధాకరమని అన్నారు.పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాల జీవన పరిస్థితులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో అధికారులు వ్యవహరించాలని కోరారు. తిరస్కరించిన పెన్షన్ దరఖాస్తులను మరోసారి సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పెన్షన్లు అందేలా సహకరించాలని కోరారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మీర్జా ఫజల్ బేగ్, సిరిపురం మాజీ సర్పంచ్ రాపోలు నిర్మల, నాయకులు పోచబోయిన మల్లేశం, సిరిపురం చేనేత సహకార సంఘం మాజీ కార్యదర్శి రాపోలు యాదగిరి, వడ్లకొండ సత్తయ్య, గజం నరసింహ, గూడెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.34,67,731/-

నార్కట్పల్లి, నవంబర్ 19



శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం చెరువుగట్టు గ్రామం నార్కట్పల్లి మండలం నల్గొండ జిల్లా తేదీ 19 11 2026 గురువారం రోజున శ్రీ స్వామి వారి ఉండి లెక్కించడం జరిగింది. 58 రోజులకు గాను హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా శ్రీ స్వామి వారి యొక్క ఆదాయం రూపాయలు 30,22, 811/- శ్రీ అమ్మవారు యొక్క ఆదాయం4,44,920/-శ్రీ స్వామివారి యొక్క అన్నదానం ద్వారా వచ్చినఆదాయం22,877/- శ్రీ స్వామి ద్వారా వచ్చిన ఆదాయం, అమ్మవారి ద్వారా వచ్చిన ఆదాయం మొత్తం34,67, 731/- రావడం జరిగింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమానికిసూపర్వైజింగ్ ఆఫీసర్గా సహాయ కమిషనర్ దేవదాయ శాఖ, నల్లగొండ నుండి ఎం వెంకటలక్ష్మి హాజరు కావడం జరిగింది.శ్రీ దుర్గా శివ సాయి సేవ సమితివారు ఈ హుండీ లెక్కించుటకు సహకారం అందించారు. అని లిశ్రీకార్య నిర్వహణ అధికారి సల్వాది మోహన్ బాబుఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పోతలపాటి రామలింగేశ్వర శర్మ, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ లిల్లీ మరియు సిబ్బంది, లింగయ్య, సీనియర్ అసిస్టెంట్, నరసింహారెడ్డి రికార్డు అసిస్టెంట్ మరియు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడలో 93వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం

- విశ్వశాంతి, ప్రజల సుఖశాంతుల కోసం 93వ మహాయాగ మహోత్సవం
- లోక కల్యాణమే ధ్యేయంగా మహాయాగం
- అయుత చండీ, అతిరుద్రం, సీతారామ పట్టాభిషేకానికి సర్వం సిద్ధం
- శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ

కోదాడ టౌన్, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):







కోదాడ పట్టణంలోని వంటిపులి గోపయ్య మైదానంలో నవంబర్ 20వ తేదీ శుక్రవారం నుంచి డిసెంబర్ 6వ తేదీ ఆదివారం వరకు 'శ్రీ కృష్ణ కాలచక్రం 93వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ కృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలిపారు. యాగశాల వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ ప్రముఖులతో కలిసి స్వామీజీ మాట్లాడి మహాయాగ వివరాలను వెల్లడించారు.?విశ్వశాంతితో పాటు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, అతివృష్టి, అనావృష్టి లేకుండా నిరంతరం ప్రజలందరూ పాడిపంటలతో, సుఖశాంతులతో ఉండటమే ఈ మహాయాగం ముఖ్య ఉద్దేశమని స్వామీజీ పేర్కొన్నారు. ఈ మహాయాగంలో విష్ణు పంచాయతనం, అయుత చండీ, అతిరుద్రం, మహాసౌర, మహాగణపతి, లక్ష్మీనారాయణ, సుదర్శన యాగాలు, కోటి కుంకుమార్చనలు, కోటి దీపోత్సవం,చతుర్వేద పూర్వక రామాయణ, భాగవత హవనాలు మరియు శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం వంటి విశేష క్రతువులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.?భక్తులందరూ పెద్ద సంఖ్యలో యాగంలో పాల్గొని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు. ఈ యజ్ఞం పరిపూర్ణంగా, దిగ్విజయంగా జరిగేందుకు ప్రజలందరూ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నిర్వాహకులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నల్లగొండ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీజా రెడ్డి బాధ్యతల స్వీకరణ..

- నగర అభివృద్ధికి కృషి చేస్తా..
ప్రజలకు అందుబాటులో ఉంటా..
- సొంత జిల్లాలో సేవలందించడం సంతోషంగా ఉంది..
- ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజా రెడ్డి

నల్లగొండ, నవంబర్ 19 (ప్రజాజ్యోతి):

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీజా రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత జిల్లాలో పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. నల్లగొండ నగర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. నగరంపై ఇప్పటికే తనకు అవగాహన ఉందని, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతానని ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజా రెడ్డి వెల్లడించారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవం

రామన్నపేట, నవంబర్ 19(ప్రజా జ్యోతి)

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ భారత ఉక్కు మహిళగా ప్రసిద్ధిగాంచిన ఇందిరాగాంధీ ప్రధానిగా చేసిన సేవలను కొనియాడారు. నెహ్రూ తర్వాత అంతటి సుదీర్ఘకాలం ప్రధానిగా దేశానికి చేసిన సేవలు గణనీయమైనవని ప్రశంసించారు. భారతదేశాన్ని అన్ని రంగాల్లో రాణించేలా ఆమె చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.చరిత్ర విభాగాధిపతి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్ మాట్లాడుతూ దేశంలో పలు సంస్కరణలు చేపట్టడంలో ఇందిరాగాంధీ కీలక పాత్ర పోషించారని, బ్యాంకులను జాతీయం చేయడం, రాజభరణాల రద్దు వంటి సాహసోపేతమైన సంస్కరణలు తీసుకురావడం గొప్ప విషయమని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులచే జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. రత్న మంజుల, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. లక్ష్మి నీలిమతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 19(ప్రజా జ్యోతి):

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కార్యాలయంలో భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలను, దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు.పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని అన్నారు.దేశ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ధైర్యసాహసాల



నాయకురాలిగా, మహిళా శక్తికి ప్రతీకగా ఇందిరా గాంధీ ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అన్నారు.ఇందిరా గాంధీ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఆదర్శమని, ఆమె చూపిన మార్గంలో పయనిస్తూ ప్రజాసేవకు అంకితమై పని



చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వివాహ ఆహ్వాన పత్రిక అందుకున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

దేవరకొండ, నవంబర్ 19, (ప్రజా జ్యోతి) :

బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్‌ను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఈ నెల 22-11-2026, ఆదివారం నేరడుగొమ్ము మండలం పేర్వాల గ్రామానికి చెందిన మారుపాకుల అనిల్ గౌడ్ వివాహ వేడుకకు హాజరుకావాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్‌కు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పేర్వాల మాజీ సర్పంచ్, ఎస్.కె. ఫతీజా బషీర్, ధర్మరేఖ తండా మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ భవన్ లో ఇందిరాగాంధీకి ఘన నివాళులు

హైదరాబాద్, నవంబర్ 19 ప్రజా జ్యోతి)

అసాధారణ నాయకత్వ పటిమతో భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఉక్కు మహిళ, భారతదేశ ప్రప్రథమ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె సేవలను స్మరించుకుంటూ గాంధీ భవన్ లో ఘన నివాళులు అర్పించారు.టీ పీ సీ సీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర మరియు ఇతర కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం వద్దు..

- హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి..

- జిల్లా కలెక్టర్‌కు బీఎస్పీ నాయకులు వినతి..

- సంక్షేమ హాస్టళ్లలో ఆహార భద్రతపై సమగ్ర తనిఖీలు చేపట్టాలి..

- పురుగుల అన్నం వద్దు నాణ్యమైన భోజనం ముద్దు..

- విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి..

- బీఎస్పీ నాయకుల డిమాండ్

నల్గొండ, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

ప్రభుత్వ గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, ఆహార భద్రతపై అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు డిమాండ్ చేశారు. హాస్టళ్లలో పురుగుల అన్నం, నాణ్యతలేని ఆహారం, కలుషిత తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి హాస్టల్‌లో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వంటగదులు, భోజనశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని కోరారు. నాణ్యతలేని ఆహారం సరఫరా చేసే కాంట్రాక్టర్లు, నిర్లక్ష్యంగా వ్యవహరించే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులతో ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేసి ఆహార నాణ్యతను పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి



కత్తుల కాన్షీరామ్, నల్గొండ పార్లమెంట్ ఇన్‌చార్జి నల్ల ప్రసాద్, మాజీ పార్లమెంట్ ఇన్‌చార్జి వంటెపాక యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు శివ, మిర్యాలగూడ నాయకుడు దినేష్, నకిరేకల్ ఇన్‌చార్జి చెడిపల్లి కాశీరాం, నల్గొండ ఇన్‌చార్జి నవీన్, నాగార్జునసాగర్ ఇన్‌చార్జి సోహెల్, దుర్గం సైదులు, గ్యార శేఖర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఎస్పీ నాయకులు స్పష్టం చేశారు.